క్లుప్తంగా

ముడిరాయి లారీ స్వాధీనం

బల్లికురవ: పర్మిట్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న ముడిరాయి లారీని మైన్స్ విజిలెన్స్ ఏడీ వీరేష్ గురువారం అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఈర్లకొండ నుంచి పర్మిట్ లేకుండా సక్రమంగా మార్టూరు వైపు వెళ్తుండగా అదుపులోకి తీసుకుని స్థానికులు పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. పర్మిట్ లేకుండా గ్రానైట్ మీటరు ముడిరాళ్ల స్లాబులు తరలించంటం చట్టరీత్యా నేరమన్నారు. ఎంతటి వారిపైనైనా పెనాల్టీతోపాటు లారీని సీజ్ చేస్తామని ఏడీ హెచ్చరించారు.

ఓట్ల తొలగింపు అర్జీదారులపై చర్యలు తీసుకోవాలి

బల్లికురవ: పథకం ప్రకారం గ్రామాల్లో లేరని ఓట్లు తొలగించాలని ఆన్‌లైన్‌లో అందజేసిన అర్జీదారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఏఈఆర్‌వో, తహసీల్దార్ యం సుభద్ర గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని వల్లాపల్లి, పెద అంబడిపూడి, చినఅంబడిపూడి, వమవరం తదితర పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో ఫారం-7 తొలగింపులకు 279 అర్జీలు అందజేశారన్నారు. ఈఅర్జీలపై ఇటీవల టీమ్ ఆధ్వర్యంలో గ్రామాల వారీగా విచారణ చేపట్టారన్నారు. తొలగింపులకు సంబంధించి వచ్చిన అర్జీదారులంతా గ్రామాల్లోనే నివాసం ఉంటున్నారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగింపులకు సంబంధించి అర్జీలు అందజేసిన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్సై పీ. నాగశివారెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ వివరించారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి


నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మహేష్‌రెడ్డి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సంతమాగులూరు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కైపు మహేష్‌రెడ్డి అన్నారు. గురువారం సంతమాగులూరు లోని పార్టీ కార్యాలయంలో కామేపల్లి, సజ్జాపురం గ్రామ ఎస్సీ కాలనీ వాసులు, గ్రామ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగనన్న అందజేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి వివరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఉత్సవమూర్తుల విగ్రహాల ఊరేగింపు



ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో నేటి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతిష్ట సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఉత్సవమూర్తుల విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. స్థానిక బొద్దురాయి సెంటర్లో నేటి ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతిష్ట సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు కోలాటం భజన కార్యక్రమాల మధ్య గ్రామంలోని వీధుల వెంట ప్రదర్శనగా బయలుదేరి మూలవిరాట్టులను ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రతిష్ట కార్యక్రమానికి భక్తులు నేడు హాజరై జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

చినగంజాం: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఎంపీడీఓ యాబీ వరప్రసాదరావు గురువారం మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. పరిశీలనలో బాగంగా మండలంలోని నీలాయపాలెం, బుచ్చిగుంట, రామచంద్రనగర్, కొత్తపాలెం, పల్లెపాలెం గ్రామాలను సందర్శించి పరిశీలించారు. పబ్లిక్ ప్రదేశాలలో, ముఖ్య కూడళ్లలో పార్టీ జెండాలను, ఫ్లెక్సీలను తొలగించాల్సిందిగా ఆయా పంచాయతీల కార్యదర్శులను ఆయన ఆదేశించారు. ఎన్నికల నిబంధలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన అధికారులను హెచ్చరించారు.

వెంకటేశ్వరస్వామివారి శాంతి కల్యాణం



స్వర్ణ (కారంచేడు): మండలంలోని స్వర్ణ గ్రామంలో కొలువైన వెంకటేశ్వరస్వామివారి దేవాలయ 48వ వార్షికోత్సవాలను గత రెండు రోజుల నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏవీఎస్ బ్రదర్స్ ఆధ్వర్యంలోని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి స్వామి వారి శాంతి కల్యాణంతో పాటు, ముత్తైదువులతో కుంకుమ పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు.


కొప్పరపాలెం-కోటావారిపాలెం రోడ్డు అభివృద్ధి పనులు


కొమ్మినేనివారిపాలెం-వల్లాపల్లి క్రాస్ రోడ్డు మధ్య రోడ్డు అభివృద్ధి పనులు


వల్లాపల్లి నుంచి ఎన్ఎస్పీ కాలువ వరకు వెళ్లే లింకు రోడ్డు అభివృద్ధి పనులు

అభివృద్ధి పథంలో లింకు రోడ్లు

- నియోజకవర్గంలో తుదిదశకు చేరిన రోడ్ల అభివృద్ధి పనులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- హనిమిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రజలు


పంగులూరు-కొమ్మినేనివారిపాలెం లింకు రోడ్డు అభివృద్ధి పనులు

ఇది కదా.. అభివృద్ధి

బల్లికురవ: గత ప్రభుత్వాలు ఎన్నడూ కూడా రోడ్లపై దృష్టిపెట్టలేదు. పలు గ్రామల ప్రజలు చాలాసార్లు అటు ప్రజాప్రతినిధులకు, ఇటు అధికారులకు సమస్యల గురించి విన్నవించారు. అయినా నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించారే తప్పా.. పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా ప్రయాణికులు, రైతులు, ప్రజలు నానా అవస్థలు పడ్డారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అద్దంకి నియోజకవర్గంలో ప్రధాన రోడ్లతో పాటు లింకురోడ్లకు మొత్తం కలిగిస్తూ నిధులు విడుదల చేసి అభివృద్ధి చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాం ఎన్నో సంవత్సరాలుగా అద్దంకి నియోజకవర్గంలో అభివృద్ధికి నోచని పలు లింకు రోడ్లను ఇటీవల అభివృద్ధి పరుస్తున్నారు. అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి గత ఏడాది డిసెంబర్ 10న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అద్దంకి సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టగానే అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, కొరిశపాడు, జే. పంగులూరు మండలాలోని ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలుసుకొని దశల వారీగా పరిష్కరిస్తున్నారు.

రోడ్ల అభివృద్ధికి శ్రీకారం..

నాగరికతకు చిహ్నలైన లింకురోడ్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కొమ్మినేనివారిపాలెం-వల్లాపల్లి క్రాస్‌రోడ్డు కొండమంజులూరు-కోటపాడు, పంగులూరు లింకురోడ్లలో 11 కిలో మీటర్లు గోతులతో అధ్వాన్నస్థితికి చేరింది. ఈ రోడ్లను చిల్లచెట్ల తొలగింపుతో పాతరోడ్డు చదరం చేసి వెట్‌మిక్స్ ఎర్త్ వర్క్, బీటీతో తారురోడ్డుగా మార్చారు. రూ. 2.3 కోట్ల నిధులు మంజూరై ఆర్అండ్‌బీ డీఈ నరసింహారావు, జేఈఈ శివన్నారాయణల పర్యవేక్షణతో పనులు తుదిదశకు చేరాయి. వల్లాపల్లి బస్ స్టాప్ నుంచి ఎన్ఎస్‌పీ కాల్వ వరకు వెళ్లేందుకు పొలిమేర డొంకరోడ్డుకు గత ప్రభుత్వాలు 5 దశాబ్దాలుగా చారడు మట్టి వేయలేదు. వల్లాపల్లి, చినఅంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, పెదఅంబడిపూడి గ్రామాల రైతులు పొలాలకు వెళ్లాలన్నా పంట ఉత్పత్తులను తరలించాలన్నా గతంలో అష్టకష్టాలు పడ్డారు. ఇటీవల ఫార్మేషన్ రోడ్డు ఏర్పాటుతో ఎర్ర గ్రావెల్ తోలి అభివృద్ధి పరిచారు. కొప్పరపాలెం నుంచి కోటావారిపాలెం వరకు వెళ్లే లింకురోడ్డు చిల్ల చెట్లు కమ్మి రోడ్డు ఆనవాళ్లే కోల్పోయింది. 10 సంవత్సరాలు ఈ రోడ్డుపై చారుడు మట్టి వేసిన దాఖలాలు లేవు. ఇటీవల చిల్లచెట్ల తొలగింపుతో గోతుల్లో గ్రావెల్ వేసి చదును చేశారు. రాకపోకలకు ఇబ్బందులు తొలగటం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి, దర్శిరోడ్డులో అద్దంకి, తిమ్మాయపాలెం మధ్య బ్రిడ్జిపై రోడ్డుకు ఏర్పడ్డ గోతులకు ప్యాచ్‌వర్క్‌లు చేయించారు. అద్దంకి, నాగులపాడు, వెంకటాపురం రోడ్డు గోతులతో అధ్వాన్నస్థితికి చేరగా ప్యాచ్‌వర్క్‌లు అద్దంకి-బల్లికురవ, బల్లికురవ-సంతమాగులూరు రోడ్డులో గోతులు రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి.

ఇబ్బందులు తొలగాయి..



కొమ్మినేనివారి పాలెం నుంచి వల్లాపల్లి క్రాస్‌రోడ్డు వల్లాపల్లి వెళ్లే రోడ్డు అభివృద్ధి పరచటం ఆనందంగా ఉంది. ఎన్నో సంవత్సరాలుగా గోతులతో అధ్వానస్థితికి చేరిన ఈ రోడ్డు అభివృద్ధితో రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి.
– ధర్మవరపు రవికుమార్, కేవీ పాలెం

రోడ్ల అభివృద్ధి ఆనందంగా ఉంది..



అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయ కర్తగా బాధ్యతలు చేపట్టిన పానెం చిన హనిమిరెడ్డి రోడ్ల అభివృద్ధిపై దృష్టిపెట్టారు. నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పరచటం ఆనందంగా ఉంది. నియోజకవర్గంలో గోతుల్లో ప్యాచ్ వర్క్, పొలాల రోడ్లు లింకురోడ్లు అభివద్ధితో కొంతమేర కష్టాలు తొలగాయి.
– మేదగం శ్రీనివాసరెడ్డి, వల్లాపల్లి

ప్రాణం ఉన్నంత వరకూ ప్రజలతోనే..

- వ్యవసాయం అంటే చాలా మక్కువ
- వెంకటేష్ సొంత కోరిక మేరకే రాజకీయాల్లోకి
- జగన్‌ను మేము నమ్మాం.. జగన్ మమ్మల్ని నమ్మారు
- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి


కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్యే

చీరాల: ఐదుసార్లు ఎమ్మెల్యే.. ఒకసారి ఎంపీ, మరొకసారి ఎమ్మెల్సీగా పనిచేసిన చరిత్ర ఆయనది. కొందరు ఆయనను ప్రకాశం టైగర్ అని, మరికొందరు పెద్దాయన అని పిలుస్తుంటారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబుతో పాటు 1978లో అసెంబ్లీ మెట్లెక్కారు. ఆయనే చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి. తాజా ఎన్నికల్లో ఆయన కుమారుడు వెంకటేష్ అధికార వైఎస్సార్ సీపీ తరఫున ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. 'తన ప్రాణం ఉన్నంత వరకూ ప్రజల కోసం పనిచేస్తా.. వ్యవసాయం అంటే చాలా మక్కువ. సొంత వ్యవసాయంతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వ్యవసాయం రంగం అభివృద్ధి కోసం పనిచేస్తా. ఇన్నాళ్లు చాలామంది స్నేహితులు, బాల్యమిత్రులను నేరుగా కలిసే అవకాశం లేకుండా పోయింది. ఇకపై స్నేహితులతో గడిపేందుకు అవకాశం.. సమయం దొరుకుతుంది. సాయం కోసం నా ఇంటికి ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తా'అంటున్నారు కరణం బలరాం. సాక్షితో ఆయన మాట్లాడారు.

మేము ముఖ్యమంత్రి జగన్‌ను నమ్మాం..

మాట ఇస్తే నిలబడే మనిషి సీఎం జగన్ మోహన్ రెడ్డి. ఆయన మమ్మల్ని నమ్మారు. వెంకటేష్ పార్టీ చేరిన రోజునే మీ అబ్బాయిని మాటీంలో వేయండి అని అన్నారు. జగన్ నమ్మాడంటే నిజాయితీగా నిలబడతాడు. చంద్రబాబు మాదిరిగా మాయమాటలు జగన్ దగ్గర ఉండవు. 1978లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యా. ఐదుసార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీగా, మరోసారి ఎమ్మెల్సీగా పనిచేశాను. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నాను. రాజకీయ విశ్రాంతి తీసుకోను. ప్రాణం ఉన్నంత వరకు ప్రజల కోసం పనిచేస్తాను. ఖాళీ సమయాన్ని వృథా చేయను.

చీరాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

సొంతగా వ్యవసాయం చేస్తాను. వ్యవసాయం, ఇరిగేషన్ శాఖలపై పూర్తి పట్టుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వ్యవసాయ రంగం అభివృద్ధి సహకరిస్తాను. ప్రధానంగా చీరాల నియోజకవర్గ అభివృద్ధికి మెరుగైన అవకాశాలు ఉన్నాయి. తీరప్రాంతాన్ని మరో గోవాగా తీర్చిదిద్దే ప్రణాళికలు ఉన్నాయి. అధికంగా నివసించే చేనేతలు, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి చెందేలా రూపకల్పన చేశాం. వైఎస్సార్ సీపీ చాలావరకు క్యాడర్ మాకు మద్దతు తెలిపి మాతో ఉన్నారు. మిగిలిన వారిని కూడా మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాం. వారితో మాట్లాడుతున్నాం. క్యాడర్ అంతా మాతో నడిచేందుకు సిద్ధంగా ఉన్నారు. అందరినీ కలుపుని పోతాం.

వెంకటేష్‌ను రాజకీయాల్లోకి రావాలని ఒత్తిడి చేయలేదు..

తను చిన్ననాటి నుంచే మా ఇంట్లో రాజకీయ వాతవారణ ఉండేది. అది చూసి వెంకటేష్ రాజకీయల వైపు ఆకర్షితుడయ్యాడు. ప్రస్తుతం వెంకటేష్ చాలా పరిపక్వత చెందాడు. కొన్ని విషయాలలో నాకంటే బాగా ఆలోచిస్తున్నాడు. రాజకీయ వేదికలపై అనర్గళంగా మాట్లాడుతున్నాడు. ప్రజల సమస్యలు సావధానంగా విని పరిష్కారం చేస్తున్నాడు. ఒకప్పుడు దూకుడుగా ఉండే వెంకటేష్ చీరాలకు వచ్చిన తరువాత చాలా సామ్యుడిగా మారాడు. నేను పుట్టి పెరిగిన చీరాలకు ఎమ్మెల్యేగా వెంకటేష్ ఉండాలన్నదే నా ఆశయం. చీరాల, అద్దంకి, పర్చూరు. కందుకూరు, ఒంగోలు, ఎస్ఎన్‌పాడు, దర్శి నియోజకవర్గాల్లో చాలా మంది నేతలు, కార్యకర్తలు నాతో కలసి పనిచేశారు. వారందరిని సమన్వయం చేసుకుని ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మెజార్టీ సీట్లు వైఎస్సార్ సీపీ కైవసం చేసుకునేందుకు కృషి చేస్తా.

అడవుల రక్షణతో పర్యావరణ సమతుల్యత


మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చినగంజాం: అడవుల రక్షణతోనే పర్యావరణ సమతుల్యత సాధించవచ్చని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రపంచ అటవీ దినోత్సవంలో భాగంగా ది ట్రీస్ ఔట్‌సైడ్ ఫారెస్ట్స్ ఇన్ ఇండియా (టీవోఎఫ్ఐ) అనే నాన్ గవర్నమెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 30 మంది పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి పాఠశాల హెచ్ఎం ఎం దేవదత్తం అధ్యక్షత వహించారు. అడవులను ఎందుకు కాపాడాలి ? అడవుల వలన ఉపయోగాలు ఏమిటి ? మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత గురించి స్టేట్ అసోసియేట్ సభ్యుడు బీ ప్రతాప్‌నాయక్, హెచ్ఎం ఎం దేవదత్తం, విద్యాకమిటీ చైర్మన్ వీ ఉదయభాస్కర్, ఇన్‌చార్జ్ హెచ్ఎం డీ నారాయణరెడ్డి, సైన్సు ఉపాధ్యాయులు బీ నాగేశ్వరరావు, ఎల్ శివప్రసాద్, డీ ఆశా లతలు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు మొదట ఐదు బహుమతులు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అనుసాగర్, నాగరాజు, జస్వంత్, ఎన్ శ్రీరమణ, కే నాగరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముడి ఆలయ పునఃప్రతిష్ట


పునఃప్రతిష్టకు సిద్ధమైన రామాలయం

జే.పంగులూరు: మండల పరిధిలోని జాగర్లమూడివారిపాలెంలో ఈనెల 26 నుంచి మూడు రోజుల పాటు కోదండరాముడి ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవం జరగనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ ఆలయ నిర్మాణం సుమారు 18 వ శతాబ్దంలో రామాలయం నిర్మించారని, 170 ఏళ్ల నుంచి శ్రీరామనవమి పండుగను గ్రామస్తులు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1973లో ఆలయం మరమ్మతులు చేసినట్లు తెలిపారు. ఈ మధ్య కాలంలో ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఆలయ కమిటీ పెద్దలు ఆలయాన్ని తొలగించి, మరో ఆలయం నూతనంగా పునఃప్రారంభించారు. నిర్మించేదుకు గ్రామస్తుల, దాతలు సహకారంతో సుమారు రూ. 2.50 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఈ ఆలయం పునఃప్రతిష్ట కార్యక్రమం ఈనెల 26తో మొదలై 28 న విగ్రహ ప్రతిష్టతో ముగుస్తుందని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన జాగృతిరెడ్డి సంక్షేమ సంఘం


ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిని కలిసిన రెడ్డి సంక్షేమ సంఘీయులు

చీరాల: చీరాల నియోజకవర్గ జాగృతి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధులు గురువారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. చీరాల నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి తమ వంతు సహాయాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు అక్కల పోలిరెడ్డి, ఉపాధ్యక్షులు రొండా భరత్‌రెడ్డి, దోకి బ్రహ్మానందరెడ్డి, సెక్రటరీ అప్పల శ్రీనివాసరెడ్డి, జాయింట్ సెక్రటరీ పాకనాటి సుధాకరరెడ్డి, వాలి ఆదినారాయణరెడ్డి, ఆట్ల చంద్రశేఖరరెడ్డి, ట్రెజరర్ కంచె సాంబిరెడ్డి, సలహాదారులు పిన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, అక్కల నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జనార్దన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రామకృష్ణారెడ్డి, పల్లెర్ల వెంకటేశ్వరరెడ్డి, డి.వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాలు

కారంచేడు: 6వ సంవత్సరం నుంచి 18వ సంవత్సరం వరకు వయస్సు ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అవసరమైన ఉచిత సహాయ ఉపకరణాల కోసం ఈనెల 27వ తేదీన పర్చూరు సహిత విద్యావనరుల కేంద్రంలో వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వినికిడి లోపం, దృష్టిలోపం, మానసిక వైకల్యం (బుద్ధి మాంద్యత), శారీరక వైకల్యం, ఆటిజం వంటి ప్రత్యేక అవసరా కలిగిన బాల,బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదరం క్యాంపునకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు జిరాక్స్, రేషన్‌కార్డు జిరాక్స్, కుల ధ్రువీకరణ పత్రం, రెండు ఫోటోలు, ఐడీ కార్డులను వెంట తీసుకురావాలన్నారు. వనంతబాబు (9100996453), బీ విజయకుమార్ (9100996460) నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

మార్టూరులో కేంద్ర బలగాల కవాతు


జాతీయ రహదారిపై కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

మార్టూరు: దేశవ్యాప్తంగా ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన నేపథ్యంలో మండల కేంద్రం మార్టూరు, నాగరాజుపల్లి గ్రామాలలో గురువారం సాయంత్రం కేంద్ర బలగాల బృందం కవాతు నిర్వహించారు. స్థానిక జాతీయ రహదారిపై, నాగరాజుపల్లి గ్రామ వీధులలో ముందు జాగ్రత్త చర్యగా సైనిక బృందాలు పర్యటించాయి. కార్యక్రమాన్ని సీఐ ఎస్వీ రాజశేఖర్‌రెడ్డి, ఏఎస్ఐలు మహబూబ్ బాషా, సైదాలు పర్యవేక్షించారు.

ఎన్నికల నియమావళి పాటించాలి..

బల్లికురవ: భారత ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీడీవో హనుమారెడ్డి అన్నారు. వీఆర్‌వోలు, సచివాయ డిజిటల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, మహిళా సంరక్షణా కార్యదర్శి గ్రామాల్లోని బ్యానర్లు, కరపత్రాల తొలగింపుతో పాటు ప్రారంభోత్సవ శిలఫలకాలకు స్టిక్కర్లు అంటించాలన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని ఎంపీడీవో వివరించారు.

ఎల్లో మీడియా వార్తలు సిగ్గుచేటు


మేనల్లుడుతో కలిసి ఫొటో దిగిన మండల కన్వీనర్ శంకర్

బల్లికురవ: ప్రభుత్వం, వలంటీర్ వ్యవస్థపై ఎల్లో మీడియా బురద జల్లేందుకు నిరాధార వార్తలు ప్రచురిస్తుందని.. ఇది సిగ్గుచేటని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ముద్దపాటి శంకర్ గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి మండలంలోని కొప్పరపాడు గ్రామంలో తన అక్క బుర్రి ధనలక్ష్మీ, బావ వీరాంజనేయులు, మేనల్లుడిన కలిసేందుకు ఇంటికి వెళ్లానన్నారు. మేనల్లుడు దానారావు మూడో వార్డు వలంటీర్‌గా పని చేస్తున్నాడని అక్కబావ, మేనల్లుల కోరిక మేరకు బంధువులతో కలిసి ఫోటో దిగానన్నారు. మేనల్లుడు దానారావు ఈఫోటోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారన్నారు. టీడీపీ పథకం ప్రకారం మేనల్లుడైన వలంటీర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడంటూ తప్పుడు వార్త ప్రచురించారని.. ఈవార్త అవాస్తమన్నారు. తాను బంధువులను మాత్రమే కలిశానని ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదన్నారు. టీడీపీ, ఎల్లో మీడియాతో కలిసి చిన్న విషయాలను సైతం పెద్ద విషయాలుగా చేస్తూ మసిపూసి మారేడు కాయ చేస్తుందని విమర్శించారు. మూడు పార్టీలు కలిసిన ప్రజా బలం ఉన్న జగనన్న, అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరని శంకర్ అన్నారు.

వాహనాల తనిఖీ

చినగంజాం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో చినగంజాం జాతీయ రహదారిపై పలు వాహనాలను గురువారం పోలీసులు ఆపి తనిఖీ చేశారు. స్థానిక టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు పలు వాహనాలను తనిఖీ చేసి పంపించారు. ఎస్ఐ ఎం శ్రీనివాసరావు చెక్ పోస్టును పరిశీలించి చిన్న వాహనాలు, కార్లు, భారీ వాహనాలను తనిఖీ చేసి పంపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌కు మోగిన ఎన్నికల నగారా

- ఎన్నికల షెడ్యూలు విడుదల
- ఈనెలాఖరులోపు ఎన్నికలు పూర్తి చేయాలని ఆదేశం

చీరాల రూరల్: చీరాల బార్ అసోసియేషన్ ఎన్నికలకు ఎన్నికల నగారా మోగింది. చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ గా సీనియర్ న్యాయవాది కరేటి రవికుమార్ రెడ్డి నియమితులయ్యారు. చీరాల బార్ అసోసియేషన్ ఎన్నికలంటే ప్రతి ఏడాది ఎంతో ఉత్కంఠంగా ఉంటుంది. పోటీలో నిలిచే అభ్యర్థులు ఇప్పటికే తమ ప్రచారాన్ని ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, జనరల్ సెక్రటరి, జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ, లైబ్రరి సెక్రటరీ, మహిళా ప్రతినిధి పోస్టులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

ఎన్నికల షెడ్యూలు ఇలా...

బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఈనెల 25న, 27న అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ, ఈనెల 30న ఎన్నికలు నిర్వహిస్తారు. వెనువెంటనే సాయంత్రం 4:30 గంటలకు ఎన్నికలలో గెలిచిన అభ్యర్థులను విజేతలుగా ప్రకటిస్తారు. చీరాల బార్ అసోసియేషన్‌లో 212 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వారిలో 12 మందిని వివిధ కారణాలతో తొలగించారు. ప్రస్తుతం 200 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గతేడాది నిర్వహించిన ఎన్నికలలో 224 మంది సభ్యులు ఉండగా వారిలో 20 మందిని వివిధ కారణాలతో తొలగించగా 180 మంది ఓటర్లుగా నమోదయ్యారు. వారిలో 168 మంది న్యాయవాదులు మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఏడాది జరిగే ఎన్నికలలో 200 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com